

# సెల్ఫ్ డిఫెన్స్

వాణిశ్రీ

వేదాంతరావు మీద వేసిన కరపత్రం చదివి నాకు చాలా బాధ కలిగింది.

మంచివాళ్ళని, చెడ్డవాళ్ళుగా ప్రచారం చేస్తుంటే ఎవరికైనా బాధే కదా?

వేదాంతరావు సంవత్సరం క్రితం మా ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడు. క్వార్టర్స్ ఎలాట్‌మెంట్ చేసే సెక్షను చూస్తున్నాడు. మా ప్రాజెక్టులో వేలకొద్దీ క్వార్టర్స్ వున్నాయి. వచ్చేవాళ్ళు వస్తుంటారు, పోయ్యే వాళ్ళు పోతుంటారు. క్వార్టర్స్ కోసం పడిగాపులు కాస్తూ వుంటారు. ఎంతో మంది ఆఫీసుకి వచ్చిపోతూ వుంటారు. వేదాంతరావు అందరితోనూ బాగానే మాట్లాడే వాడు. లంచాలు అడుగుతున్నాడని ఎవరూ ఆరోపించ లేదు. కాని ఎవరితోనైనా మర్యాద తప్పాడా అంటే అదీ లేదు. అప్పుడప్పుడూ విసిగించే పార్టీల మీద చిరాకు పడిన మాట వాస్తవమే కావచ్చు. రోజూ ఏభై, అరవై కరెంట్సు చూస్తూ, వచ్చే పోయే వాళ్ళకి పెద్ద సమాధానాలు చెప్తూ, గొడ్డు చాకిరి చేసే ఏ గుమస్తా అయినా ఆ మాత్రం విసుక్కోక మానడు.

ఆ మాత్రం దానికి ఇంత పెద్ద ఆరోపణ చెయ్యాలా?

వేదాంతరావు క్వార్టర్స్ ఎలాట్‌మెంట్ ఆర్డర్స్ వేసినందుకు బాహాటంగా లంచాలు తీసుకుంటున్నాడట.

లంచాలు ఇచ్చిన వాళ్ళతో అసలు మాట్లాడడట. 'కాఫీకి పదండి' అంటూ ఆఫీసు క్యాంటీన్‌కి తీసుకెళ్ళి అక్కడ పుచ్చుకుంటాడట లంచం.

ఆఫీసు క్యాంటీన్ అతని స్థావరమట

అతను లోగడ పని చేసిన ఆఫీసుల్లో లంచాలు తినడం మరిగిన వాడే నట.

ఇలా రాశారు ఆ కరపత్రంలో.

'కాఫీ తాగుదాం రండి గురూ!' అని ఎవరైనా పిలిచారనుకోండి, వెళ్ళకుండా వుంటే మర్యాదగా వుంటుందా?

గుమస్తా కాఫీ తాగడని కూడా కరపత్రం వెయ్యాలా? ఈ పిచ్చి అవినీతి ప్రపంచంలో గుమస్తాలే దొరికారా?

అది చదువుతుంటే వళ్ళు మండి పోతోంది. నేనూ గుమస్తానే కదా మరి ఈ రోజు వేదాంతరావు మీద వేశారు, రేపు నామీద మాత్రం వెయ్యరా?

ఆ కరపత్రం చదివి ఆకాశరామన్నగాడిని వేదాంతరావు ముందే నోటికొచ్చినట్లు దులిపేశాను.

అతను మాత్రం లోలోన బాధ పడుతున్నాడుగాని పైకి ఎంతో గంభీరంగా వున్నాడు.

"ఎవరి పాపం వాళ్ళది" అని మాత్రం అన్నాడు.

ఆ ఒక్క వాక్యాన్ని బట్టి అతని మంచితనాన్ని అర్థం చేసుకోవచ్చు

కాని ఎవరు అర్థం చేసుకుంటారు మంచివాడిని?

* * *

వేదాంతరావు మీద అవినీతి ఆరోపణ వచ్చినా మా ఆఫీసర్‌గారు మాత్రం అతనికి స్థాన భ్రంశం కలిగించలేదు. ఆయనకు మాత్రం తెలియదా అతని మంచితనం.

"నువ్వేం బాధపడకు. ఎవరో గిట్టని వాళ్ళు ఇటువంటివి వేస్తూనే వుంటారు. అందరితో మంచితనంగా వుండటం సాధ్యం కాదు గదా" అన్నారు ఓదారుస్తూ.

వెల్ సెడ్.

వేదాంతరావు మామూలుగా తన పని తను చేసుకుంటూ రొటీన్‌లో పడడంతో నేను చాలా సంతోషించాను.

అతను ఎంతో గుండె ధైర్యం కలవాడనే చెప్పాలి. అదే గనుక నావంటి సెన్సిటివ్ ఫెలో అయితే ఏడుస్తూ కూర్చునేవాడే.

అందుకే జీవితం ఏది ప్రసాదించినా

చిరునవ్వుతో స్వీకరించమన్నారు పెద్దలు.

రోజులు గడిచిపోతున్నాయి.

వేదాంతరావు మునుపటి మనిషి కాదనీ, డబ్బు ముఖం చూడందే కాగితం కదవడం లేదనీ, వార్తలు వింటున్నాను.

మంచివాడికి కోసం వస్తే అంతే మరి. అందరూ చెడ్డవాడని అంటూ వుంటే మారక చస్తాడా? మార్పు మానవ సహజం మరి.

అయినా స్నేహితుడు డబ్బు కోసం చెడిపోతూ వుంటే చూస్తూ వూరుకోలేం గదా!

“మరో కరపత్రం రాకుండా జాగ్రత్త పడవోయ్ వేదాంతం.” అని హెచ్చరించాను.

అతను నవ్వి “ఎందుకొస్తుంది?” అన్నాడు.

నేను అతన్ని గురించి వింటున్న వార్తలన్నీ చెప్పాను

అతను గంభీరంగా మారిపోయి “నిజమే గురూ” అన్నాడు.

“అయితే మళ్ళీ ఏ ఆకాశరామన్నో కరపత్రం వేస్తాడు.”

“ఎవరికేం పట్టింది వెయ్యడానికి? వాళ్ళకేం పనిలేని ప్రెస్‌లు వున్నాయా? చివరికుంది అంత తీరికా, ఉద్దాను” అన్నాడు.

“రోగడ వేసిన వాళ్ళే” అన్నాను.

వేదాంతరావు పక, పకా నవ్వి “రోగడ వేసింది ఎవరో నాకు తెలుసు. వాళ్ళు మళ్ళీ వెయ్యరు” అన్నాడు

“ఎవరు వాళ్ళు” అని ప్రశ్నించాను కుతూహలంతో.

“నే నే” అన్నాడు.

ఆశ్చర్యంతో మూర్ఛపోయాను.

“అవునోయ్! నీకు వింతగానే వుండొచ్చు. కాని ఏం చెయ్యను చెప్పు? మన ఆఫీసులో వాళ్ళకి లంచాలు తీసుకోవడం అలవాటు లేదని మొదట్లోనే గ్రహించాను. ఈ కొండలమీద వాస్తవ ప్రపంచానికి దూరంగా వున్నారు మీరు. దేశమంతా ఒకదారిన పోతుంటే మీదొక దారి. ఇక్కడ ప్రతివాళ్ళు పని చేయించుకుని పోతున్నారుగాని దమ్మిడీ ముట్టజెప్పేవాళ్ళే కన్పించలేదు. పతివ్రతల్ని చూసినట్లు చూస్తున్నారు. నేను లంచానికి అలవాటు పడిన వాడిని వూపిరాడ్డం లేదనుకో. మరి అటువంటి పరిస్థితుల్లో నేను లంచాలు పుచ్చుకుంటున్నానని అందరికీ తెలియ చెయ్యడం ఎలా? నన్ను నేను నీతి బారి నుంచి రక్షించుకునే మార్గం ఏది? అని ఆలోచించి, ఆలోచించి చివరికి నా మీద నేనే కరపత్రం వేయించుకున్నాను. మళ్ళీ చివరిలోనూ అనకు సిల్లీగా వుంటుంది...” అని కాసేపాగి “దాని ఫలితం బాగానే వుందిలే” అన్నాడు వేదాంతరావు సంతృప్తిగా.


నిజమైన
వార్తలకి

న్యాయమైన
వ్యాఖ్యలకి

ఆంధ్రపత్రిక

చదవండి!



# తలనొప్పా? అయితే తీసుకోండి ఒక గ్లాసెడు నీళ్లు



మరియు ఒకే ఒక సారిడన్

RP-2158